క్లుప్తంగా

చందన అలంకారంలో స్వామి

మేదరమెట్ల: స్థానిక అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం స్వామి వారిని పూర్తిగా చందనంతో అలంకరించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తిని రాత్రి సమయంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

చీరాల: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి స్థానిక 216 జాతీయ రహదారిపై మన్నం ఫ్రెడ్ అపార్టుమెంట్ వద్ద చోటుచేసుకుంది. వేటపాలెం మండలం అబ్దుల్‌కలాం కాలనీకి చెందిన పాలపర్తి వంశి, పాత చీరాలకు చెందిన భీమవరపు శ్రీనివాసరావు, లక్ష్మీపురానికి చెందిన పల్లం వెన్ని ముగ్గురు ద్విచక్రవాహనంపై వెళుతూ అపార్టుమెంట్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. తీవ్రగాయాలైన ముగ్గురిని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పాలపర్తి వంశిని గుంటూరు తరలించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


డ్రైనేజీ సిల్టు పనులు పరిశీలిస్తున్న కమిషనర్

చీరాల అర్బన్: డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. బుధవారం స్వర్ణ రోడ్డు గేటు వద్ద గల డ్రైనేజీ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. డ్రైనేజీలో నిల్వ ఉన్న సిల్టు, చెత్తను వర్కర్ల ద్వారా శుభ్రం చేయించారు. అనంతరం వైకుంఠపురంలో కాలువలను పరిశీలించారు. కాలువల్లో నిల్వ ఉన్న చెత్తను, సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

భవిత కేంద్రం విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులకు షీల్డు అందిస్తున్న జిల్లా సమగ్రశిక్ష అధికారులు

అద్దంకి రూరల్: అద్దంకి భవిత కేంద్రంలో శిక్షణ పొందిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కోదూరి జాయ్ హదస్సా (బుద్ధిమాద్యం) స్థానిక గురకాయపాలెం ఉన్నత పాఠశాలలో, పందిరి ప్రశాంత్ (వినికిడిలోపం) తిమ్మాయపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణిల్లో ఉత్తీర్ణత సాధించారు. బుధవారం బాపట్ల జిల్లా సమగ్ర శిక్షణ కార్యాలయంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ జోత్స్న అధ్యక్షతన జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ యం. వెంకట సుధాకరరావు విద్యార్థులకు మోమెంటో అందజేసి అభినందించారు. అద్దంకి మండల విద్యాశాఖాధి కారులు డి. గంగాధరరావు, బి.సుధాకరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనాను అభినందనలు తెలిపారు.

కూరగాయల మార్కెట్లకు బహిరంగ వేలం

చీరాల: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చీరాలలోని నెహ్రూ కూరగాయల మార్కెట్, పేరాల మార్కెట్, తోపుడు బండ్లకు 9 నెలలకు జరిగిన బహిరంగ వేలంపాటను నిర్వహించారు. నెహ్రూ కూరగాయల మార్కెట్‌కు రూ.70.60లక్షలు, పేరాల మార్కెట్‌కు రూ.4.85 లక్షలు, తోపుడు బండ్లకు రూ.9.79 లక్షలకు హెచ్చుపాట పాడారు. మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, రెవెన్యూ ఆఫీసర్ బి.శ్యామలాదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందిస్తున్న దాత శ్రీనివాసరావు, ఎంఈఓ గోపి

యద్దనపూడి: మండలంలోని అనంతవరం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఒంగోలులో లెక్చరర్‌గా పనిచేస్తున్న పెదవల్లి శ్రీనివాసరావు విద్యార్థులకు రూ.10 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు , తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఎంఈఓ–2 చిలుకూరి గోపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని కొనియాడారు. మాజీ సర్పంచ్ పెదవల్లి కామేశ్వరావు, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, పెదవల్లి సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎస్‌కే నీలోఫర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిత నాశనం


రావినూతలలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, చిన్నారులు


చీరాల: పట్టణంలో ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ ప్రసాద్


బల్లికురవలో మానవ హారంలో మాట్లాడుతున్న సీఐ నరసింహారావు


పంగులూరులో సంకల్పం ర్యాలీ

చీరాల అర్బన్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా అడుగులు వేయాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌లు, సెబ్ అధికారులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పేరాల సెంటర్ నుంచి ముంతావారి సెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, గడియార స్తంభం సెంటర్ వరకు కాలేజీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతనే టార్గెట్ చేసుకుని కొందరు వ్యక్తులు గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలు రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సైలు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి: మాదక ద్రవ్యాల వినియోగం మనిషి ఆరోగ్యానికి హానికరమని ఎస్సై నాగరాజు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగంపై బుధవారం ఆయన పట్టణంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. బస్టాండు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి, విద్యార్థులతో ప్రమాణం చేయించారు. పోలీస్ స్టేషన్ నుంచి బయదలుదేరి పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మత్తు మందులు, మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకుంటుందని చెప్పారు. పెద్దలు పిల్లల ప్రవర్తను గమనించి చెడు వ్యసనాల వైపు మళ్లకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సెబ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మేదరమెట్ల: డ్రగ్స్‌లేని సమాజాన్ని ఏర్పాటు చేసుకుందాం అంటూ మేదరమెట్ల, కొరిశపాడు పోలీసులు బుధవారం యాంటీ డ్రగ్‌డే నిర్వహించారు. రావినూతల గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించగా మేదరమెట్ల పోలీసులు కూడా మేదరమెట్లలో ర్యాలీని నిర్వహించి డ్రగ్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకుందాం అంటూ నినాదాలు చేశారు.

కారంచేడు: నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వీటికి యువత దూరంగా ఉండాలని ఎస్ఐ కె. సురేష్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు చినవంతెన సెంటర్, ఆంధ్రి బ్యాంకు సెంటర్‌లో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డ్రగ్స్ వ్యతిరేక సంకల్పం పేరిట ప్రజల్లో ప్రధానంగా యువతీ, యువకుల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌లు, స్థానిక పోలీస్‌లు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


అద్దంకి: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


వేటపాలెంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్


కారంచేడులో డ్రగ్స్ వ్యతిరేతకపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

జె.పంగులూరు: మాదక ద్రవ్యాల అమ్మకాలు, వాటి వాడకాలు చట్టరీత్యా నేరమని రేణింగవరం ఎస్సై తిరుపతిరావు అన్నారు. పంగులూరులో బుధవారం మాదక ద్రవ్యాల నియంత్ర కార్యక్రమంలో భాగంగా సంకల్పం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంగులు బస్టాండ్ సెంటర్‌లో మాదక ద్రవ్యాల వాడటం వలన జరిగే అనర్థాల ప్రసంగించారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు.

బల్లికురవ: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సంతమాగులూరు సీఐ కె.నరసింహారావు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా బుధవారం బల్లికురవ మత్తు పదార్థాల నిషేధంపై ర్యాలీ స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. చదువుపై ఏకాగ్రతతో మంచి ఫలితాలు సాధించి పాఠశాలలకు, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాత్యులు తేవాలని సీఐ కోరారు. మత్తుపదార్థాల జోలికి వెళ్తే జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి, బల్లికురవ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యం. అనిల్ కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

వేటపాలెం: మాదకద్రవ్యాలు వాడకం వల్ల వారి జీవితాలు నాశనం అవ్వడంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఎస్సై జి. సురేష్ హెచ్చరించారు. స్థానిక పోలీసుల అధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలు దేరిన విద్యార్థులు నినాదాలు చేస్తూ గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. మానవ హారంగా ఏర్పడి మాదక ద్రవ్యాల వాడకంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడటం వల్ల అనేక అసాంఘిక చర్యతో పాటు అమానవీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల ఈపూరుపాలెంలో ఒక యువతిపై దారుణమైన సంఘటన జరిగిందని గుర్తు చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి వివరాలు వారు పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శామ్యూల్, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, బీబీహెచ్ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువును దైవంగా భావించాలి


ఉపాధ్యాయురాలు రాధారాణి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: ప్రతి విద్యార్థి గురువును దైవంగా భావిస్తూ తన భవిష్యత్తుకు అనుభవాన్ని వారధిగా చేసుకుని ముందుకు సాగుతాడని జిల్లా ఇన్‌చార్జి డీఈఓ జి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వాడరేవు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల స్వచ్ఛందంగా పదవీవిరమణ చేసిన పి.రాధారాణి సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎవరికీ కేటాయించినంత సమయాన్ని గురువు వద్ద గడుపుతారని, అలా జీవితాలకు ఒక రూపం కల్పించి తీర్చిదిద్దే గురువులనే ప్రత్యక్ష దైవాలుగా భావిస్తుంటారన్నారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదన్నారు. ఉపాధ్యాయుల వైఖరి, ప్రవర్తన, ఆదర్శాలు సమాజానికి మార్గనిర్దేశనం చేస్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు విలువలకు ప్రాధాన్యత మిచ్చి పిల్లలకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పించి వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు రాధారాణి, శ్రీరామచంద్రమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, వడలి రాధాకృష్ణ, నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, జయప్రద, నరసింహారావు, సికిందర్ మీర్జాన్, సూరిబాబు, లూకా, దండా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలు ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న కరణం బలరామకృష్ణమూర్తి

జె. పంగులూరు: ఉన్నత వ్యక్తిత్వంతో ప్రజలకు సేవలందించిన ఆదర్శవంతుమైన వాడు బెల్లకొండ దశరథ రామయ్య అని మాజీ శాసన సభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శవంతమైందన్నారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన చందలూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ దశరథ రామయ్య దశదిన కర్మ బుధవారం చందలూరులోని ఆయన స్వగృహంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కేసీహెచ్ పున్నయ్య చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ క్రమశిక్షణ నిజాయితీ గలిగిన దశరథ రామయ్య మరణించటం చాలా బాధాకంగా ఉందని, చాలా కాలంగా అయన తన రాజకీయంగా సన్నిహితంగా మెలిగారని గుర్తు చేసుకున్నారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షునిగా పని చేసిన దశరథ రామయ్య క్రీడలను ఎంతో ప్రోత్సహించారని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి కరణం పున్నయ్య చౌదరి, ఒలింపింక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు అన్నారు. పీడీసీసీ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ మద్దినేని నాగేంద్రప్రసాద్, గ్రామ సీపీఎం సీనియర్ నాయకులు హనుమంతురావు, పెంట్యాల రాధాకృష్ణ, విశ్రాంత హెచ్ ఎం నార్ని తాతయ్య, రాఘవరాజు, కొల్లా సురేంద్ర, పెంట్యాల రామలింగస్వామి, కందిమల్ల నాగేశ్వరరావు, పెంట్యాల సుబ్బారావు, గుర్రం ఆదిశేకర్, బోరెడ్డి ఓబులరెడ్డి, గొల్లపూడి అంజయ్య, రామాంజనేయులు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హత ఉంటే కౌలు రైతు గుర్తింపు కార్డులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ

కారంచేడు: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులను మంజూరు చేస్తామని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి సూచనలు చేశారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కావాల్సిన అర్హులు మీరు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న చేను (పొలం) పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీతో పాటు, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలను తీసుకోని అర్జీని పూర్తి చేసి మీ సమీప వీఆర్‌ఓలకు అందించాలన్నారు. అప్పుడు మీ ప్రాంత వీఆర్‌ఓలు విచారణ చేసి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులను మంజూరు చేయిస్తారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులు వెంటనే అర్జీలు పెట్టుకోవాలన్నారు. ఈ కార్డులున్న వారికి మాత్రమే ప్రభుత్వం నుంచి అందించే రాయితీలు, నష్టపరిహారం అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

పండ్ల తోటల కోసం రైతుల గుర్తింపు

అద్దంకి: పండ్ల తోటల పెంపకం కోసం గ్రామాల వారీగా సాగు చేసే రైతులను గుర్తించాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పండ్ల తోటల పెంపకంపై ఉపాధి హామీ సిబ్బంది అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను సాగు చేసే రైతులను గుర్తించే పనిని సిబ్బంది చేపట్టబోతోందన్నారు. పథకం ద్వారా వివిధ రకాల పండ్ల తోటలకు శాఖ నుంచి రాయితీతో పాటు మొక్కలను అందజేస్తారని చెప్పారు. తద్వారా ఉపాధి హామీ సిబ్బందికి పనితోపాటు, పండ్ల తోటల విస్తీర్ణం పెంపు జరుగుతుందన్నారు. మామిడి, జీడి మామిడి, కొబ్బరి, చీనీ నిమ్మ, నిమ్మ, జామ, సపోట, సీతాఫలం, దానిమ్మ, తైవాన్‌జామ, డ్రాగన్‌ఫ్రూట్, గులాబీ తోట, మల్లె తోట, అంజూర, మునగ, నేరేడు వంటి తోటలను సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఆయా తోటల సాగు కోసం ఉపాధి హామీ నుంచి అర్హులైన వారికి తోటల పెంపకం చేపట్టేందుకు అనుమతి వస్తుందని చెప్పారు. సిబ్బంది గ్రామాల వారీగా తోటలు సాగు చేసే రైతులను గుర్తించే పని సత్వరం చేపట్టాలని ఎంపీడీఓ కోరారు. సమావేశంలో ఏపీవో గాయత్రి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలతో పాటు 5 సంవత్సరాల్లోపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు ఇమ్యూనైజేషన్‌ను సక్రమంగా అందించాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడారు. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య స్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పలకరించి చిన్నారుల ఆరోగ్య స్థితి గతులను విధిగా రికార్డుల్లో నమోదు చేసి నివేదికలు అందించాలన్నారు. ఏ ఒక్క చిన్నారి కూడా అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాల గణాంకాలను వారం రోజుల్లో అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్

చీరాల రూరల్ : బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని వారిపట్ల జరుగుతున్న వివక్షతను పోగొట్టాలంటే రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచన చేసి మొట్టమొదటి సారిగా వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించిన మహోన్నతుడు సాహు మహరాజ్‌ని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కొనియాడారు. సాహు మహరాజ్ 150వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. 18వ శతాబ్దంలోనే సాహుమహరాజ్ బడుగు, బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని, వారి అభివృద్ధిని కాంక్షిస్తూ రిజర్వేషన్లకు అంకురార్పణ చేశారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. నాయకులు డొక్కా జగన్ మోహనరావు, కాటి మార్క్, గొర్రెపాటి రవి కుమార్, సిర్రా భగత్ సింగ్, దుడ్డు భాస్కరరావు, డొక్కా దానియేల్, తేళ్ల వెంకటస్వామి, శివప్రసాద్, జగదీష్, సుధాకర్, వంశి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కొలుపులు


అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని నక్కబొక్కలపాడులో నాలుగు రోజులుగా కోలాహలంగా కొలుపులు నిర్వహిస్తున్నారు. శ్రీ పోలేరమ్మ, శ్రీఅంకమ్మల కొలుపుల సందర్భంగా ఆలయాలను ముస్తాబుతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి రోజూ అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో అలంకరించారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలు, పాటకచేరీ, బొల్లావులతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. గురువారంతో వేడుకలు ముగుస్తాయి. శుక్రవారం అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. వేడుకల్లో భాగంగా వ్యవసాయ పనులు వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా, వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా గ్రామానికి తరలిరావటంతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది.

దోషులను వెంటనే శిక్షించాలి


యువతి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం


చీరాల: ఈపూరుపాలెంలో దేవాంగ చేనేత కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ దేవాంగ సాధికారిక సమితి, రాష్ట్ర దేవాంగ సంఘం ప్రతినిధులు అన్నారు. బుధవారం ఈపూరుపాలెంలో బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలి ఘటనలో ఇప్పటికే దోషులను అరెస్ట్ చేశారని, వారికి కఠిన శిక్షలు విధించాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దోషులకు కఠిన శిక్షలు విధించాలని, మా బిడ్డకు జరిగిన అన్యాయం మరో ఆడబిడ్డకు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాదకద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. చప్పరం మల్లిఖార్జున, ఎ.ధనుంజయ, పులి రాంగోపాల్, పి.ప్రదీప్, ఆశం సురేష్, తాళ్ల నరసింహస్వామి, మారం మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, రాష్ట్ర ఈసీ మెంబర్ ఎస్.కుమారస్వామి, ఆలిండియా దేవాంగ సమాఖ్య ఏపీ మీడియా ఇన్‌చార్జి గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా పెరిగిన దేవుడు మాన్యం కౌలు రేట్లు

జె.పంగులూరు:

మండలంలోని జనకవరం, కోటపాడు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన దేవుని మాన్యం భూములు కౌలు వేలం పాట స్వల్పంగా పెరిగాయి. ఆయా గ్రామాల్లోని దేవుని మాన్యం భూమి బహిరంగా వేలం పాట దేవాదాయ శాఖ పంగులూరు గ్రూపు కార్య నిర్వహణా. దికారి ఉప్పలమర్తి శ్రీనివాసరావు బుధవారం నిర్వహించారు. కోపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం భూములు గతంలో రూ. 58,500 పాడగా, ప్రస్తుతం ఆ భూములు వేలం రూ.70 వేలు పలికింది. గతం కన్నా రూ. 11,500 రూపాయలు అధికంగా పాట వచ్చింది. భోగేశ్వరస్వామి వారి దేవాలయాలకు చెందిన భూములు గతంలో రూ. 1,95,000 కాగా , ప్రస్తుతం రూ.1,96,800 పాట వచ్చింది. కేవలం రూ. 1800 మాత్రమే పెరిగింది. జనకవరం గ్రామంలోని జరుగుల మల్లయ్య కుంట భూములు గతంలో రూ.72,500 కాగా, ప్రస్తుతం రూ.79,800 పాట వచ్చింది. కేవలం రూ. 7,300 పెరిగింది. తూర్పు కొప్పెరపాడు గ్రామంలోని జనార్దన స్వామి భూములు గతంలో రూ.83,500 కాగా, ప్రస్తుతం రూ.80,700 పాట వచ్చింది. ఈ భూములు రూ.2,800 తగ్గింది. మల్లేశ్వర స్వామి దేవాలయాలకు చెందిన భూములు కౌలు లోగడ రూ. 38,500 కాగా, ప్రస్తుతం రూ. 40,000 వేలు వచ్చింది. వీటికి సంబంధించి కేవలం రూ. 1500 మాత్రమే పెరిగింది.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం


తలపనేని రామారావు

జె.పంగులూరు: వ్యవసాయంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకొని, లాభసాటిగా వ్యవసాయాన్ని మార్చుకోవాలంటే పోరాటం ఒక్కటే మార్గమని, అందుకోసం రైతులను ఐక్యం చేయాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. బుధవారం పంగులూరులోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సముద్ర తీరప్రాంతంలో వేరుశనగ, కూరగాయలు పూలు సాగు అవుతున్నాయని, రొయ్యల పెంపకం కూడా తీర ప్రాంతంలో ప్రముఖంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ విధానలు, ప్రకృతి వైపరీత్యాలు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కల్తీలుగా మారటమేనన్నారు. వ్యవసాయంలో లాభసాటిగా మారాలంటే ఆరు బయట చేసే వ్యవసాయానికి రక్షణ కావాలని, ఆ పని పాలకవర్గాలు చేయాలని తెలిపారు.

భూసార పరీక్షలతో రైతులకు లాభదాయకం

వేటపాలెం: రైతులు తమ పంట భూముల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని, దీని వల్ల రైతులకు లాభం చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి ఐ. కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని పుల్లరిపాలెంలో పంట భూముల్లో మట్టి నమూనాల తీసుకొని రైతులకు భూసార పరీక్షలపై బుధవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంట భూములకు కావాల్సిన మేరకు ఏరువులు వాడు కోవడం వల్ల తక్కువ పెట్టు బడులతో పంట దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటి వరకు రైతుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ సాంబశివరావు, వీఆర్‌ఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.